క్లుప్తంగా

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది 9వ తరగతిలో టాపర్స్‌గా నిలిచిన 10 మంది విద్యార్థులకు అకౌంట్‌లో డబ్బులు జమ చేశారు. రూ.2,500 చొప్పున మొత్తం రూ.25 వేల నగదు బయోస్టాడ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో జమచేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు హేమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



గట్టు: సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును సోమవారం గద్వాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ లబ్ధిదారురాలకు అందజేశారు. గొర్లఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన శాంతికుమారికి సీఎం సహాయ నిధి ద్వారా రూ.10 వేలు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



కేటీదొడ్డి: ఇటీవల కురిసిన వర్షాలకు ఆముదం పత్తి, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న పంటలో పురుగులు, తెగుళ్ల నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఈఓ భరత్ సింహ అన్నారు. సోమవారం మండలంలోని చింతలకుంట క్లస్టర్ పరిధిలో ఆముదం పంటలను పరిశీలించారు. చిలుక పురుగు, సెమిలూపర్ పురుగుల దాడిని గుర్తించారు. అనంతరం రైతులకు తక్షణం అనుసరించవలసిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. వేపనూనె 5 మి.లీ. లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. పురుగు గుడ్ల గుంపులు, చిన్న పురుగులను ఏరిపట్టి నాశనం చేయాలని, ఫెరోమోన్ ట్రాప్స్ 5 మి.లీ. లీటర్ నీటితో పిచికారీ చేయాలని పేర్కొన్నారు.

బెల్ట్, బూట్లు వితరణ



మానవపాడు: మండల పరిధిలోని పెద్దాముదాలపాడు ప్రాథమిక పాఠశాలలో సోమవారం దాత తరుణ్‌రెడ్డి సహకారంతో ఎంఈఓ శివప్రసాద్, ఎంపీడీఓ రాఘవ ఆధ్వర్యంలో విద్యార్థులకు టై, బెల్ట్, బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, నాయకులు యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా ఉత్సవాలు జరుపుకోవాలి

ఎర్రవల్లి: ప్రజలు శాంతియుతంగా గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని కోదండాపురం ఎస్ఐ మురళీ సూచించారు. పీఎస్ పరిధిలోని ఆయా గ్రామాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు తప్పనిసరిగా పోలీసు, విద్యుత్ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. కుల మతాలకు అతీతంగా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిర్వహించాలని పేర్కొన్నారు.

ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు

ఆత్మకూర్: ఎంపీ నిధులతో నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం కేపీటీ ప్రభుత్వ పాఠశాలలో రూ.35 లక్షల నిధులతో కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ మంజూరుతో స్థల పరిశీలన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలరాజు, అశోక్‌భూపాల్, తమ్మలి విజయ్, మనోహర్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖననానికి స్థలం కరువాయె!

- పూడ్చిన చోటే తవ్వి పూడుస్తున్న వైనం
- స్మశాన వాటికలకు స్థలం లేక అవస్థలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



ధరూరులోని ఎస్సీ కాలనీలో ఇళ్ల మధ్య స్మశానవాటిక

ధరూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మనిషి చనిపోవడం పెద్ద కష్టమైతే వారి పూడ్చి పెట్టడం అంతకన్నా పెద్ద కష్టంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. దశాబ్దాలుగా పాత వాటినే తవ్వి పూడ్చి పెట్టాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆరోపణ, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అస్థికలను తీసి.. మరలా అదే స్థలంలో..

మండల కేంద్రమైన ధరూరుతో పాటు మర్లబీడు, మాల్‌దొడ్డి, గుడ్డెందొడ్డి గ్రామాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఈ గ్రామాల్లోని జనం ఎవరైనా చనిపోతే కుటుంబ సభ్యులు పడే బాధకంటే ఖననం చేసేందుకు స్థలం లేక మరింత బాధను అనుభవిస్తున్నామంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న కొద్దిపాటి స్థలంలోనే పాత అస్థికలను తీసి తిరిగి చనిపోయిన వారి శవాలను పూడ్చుకునే పరిస్థితి నెలకొంది.

నెరవేరని హామీలు..

ప్రతి గ్రామసభలో, ఎన్నికల సమయంలోనూ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు ఇస్తున్నా కార్యరూపం దాల్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రాబోతున్న ఎన్నికల్లో మళ్లీ అదే అంశాన్ని తెరపైకి తెచ్చి ఓట్లు దండుకునే నాయకులకు తగిన బుద్ధి చెబుతామని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

స్థలం కేటాయించాలి



మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీ వాసులకు కేటాయించిన స్మశానవాటిక స్థలాలు అరకొరగా ఉన్నాయి. ఎప్పుడో దశాబ్దాల క్రితం ఇచ్చిన స్థలాలే ఇవి. పెరిగిన జనాభాకు అనుగుణంగా స్థలం కేటాయించాల్సిన అవసరం ఉంది. ఎస్సీ కాలనీలో ఇళ్ల మధ్యలో ఉండడం వల్ల ఇబ్బంది పడుతున్నాం. బీసీ కాలనీ శ్మశాన వాటికలో పూడ్చిన స్థలంలో గుంతలమయంగా ఉంది.

– మూకెన్న, ధరూరు

పట్టించుకోవడం లేదు



స్మశాన వాటికలకు స్థలం కేటాయించాలని ఏళ్ల తరబడి కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.ప్రభుత్వానికి నివేదికలు పంపించామంటున్నారే తప్పా నేటికీ వాటికి పరిష్కారం చూపడం లేదు. ఉన్న కొద్దిపాటి స్థలంలోనే తిరిగి పూడ్చాల్సి వస్తోంది. అధికారులను అడిగి వేసారిపోయాం. అయినా కనికరనించడం లేదు.

– అంజిసాగర్ మాల్‌దొడ్డి

అనుకూలంగా ఉంటే ఇస్తాం

ఏ గ్రామంలో అయితే సమస్య తీవ్రంగా ఉందో ఆ గ్రామస్తులు స్మశాన వాటికకు దరఖాస్తు చేసుకోవాలి. అదే గ్రామంలో గ్రామస్తులకు అనుకూలంగా ఉన్న పొలం విక్రయించేందుకు భూయజమానికి ముందుకు రావడంతో పాటు గ్రామంలోని దాతలు కొంత ఆర్థికంగా సహకరిస్తే తప్పకుండా స్మశాన వాటికల సమస్య పరిష్కరిస్తాం. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– నరేందర్, తహసీల్దార్, ధరూరు

రేషన్ డీలర్ల కమీషన్ విడుదల చేయాలి



అలంపూర్‌లో వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

అలంపూర్: పెండింగ్‌లో ఉన్న రేషన్ డీలర్ల కమీషన్ తక్షణమే విడదల చేయాలని మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కోరారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ.. రేషన్ డీలర్లకు గత ఐదు నెలలుగా కమీషన్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. సకాలంలో కమీషన్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో రేషన్ డీలర్లకు గౌరవ వేతనం నెలకు రూ.5 వేలు, కమీషన్ రూ. 3వేలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. గౌరవ వేతనం, పెంచిన కమీషన్ రాకపోగా సాధరణంగా రావాల్సిన కమీషన్ సైతం పెండింగ్‌లో ఉండటంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. తక్షణమే డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

రాజోళి: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని రేషన్ డీలర్లు తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతి పత్రం అందచేశారు. ప్రభుత్వం మూడు నెలల బియ్యం ప్రజలకు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టగా పంపిణీని పారదర్శకంగా నిర్వహించామన్నారు. అయినా కూడా ప్రభుత్వం ఇవ్వాల్సిన కమీషన్ ఇవ్వకుండా ఆలస్యం చేయడంతో సమస్యలు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు.

గౌరవ వేతనం అందించాలి

ఉండవెల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రభాకర్‌కు మండలంలోని డీలర్లు కమీషన్, గౌరవ వేతనం అందించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీలర్ల మండల అధ్యక్షుడు రామాంజనేయులు, కోశాధికారి రాజశేఖర్, సర్దార్, ఖాసీం, విజయ్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నిరసన

అయిజ: మండల కేంద్రంలో రేషన్ డీలర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాములు మాట్లాడారు. డీలర్లకు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలల కమీషన్ విడుదల చేయలేదన్నారు. దీంతో డీలర్లు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీను, ప్రతాప్, నర్సన్‌గౌడ్, భీమయ్య, హనుమంతుగౌడ్, మహేశ్వరి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలో..



మల్దకల్‌లో..



రాజోళిలో..

కమీషన్ వెంటనే చెల్లించాలి

మల్దకల్: ఐదు నెలలుగా పెండింగ్‌లో రేషన్ డీలర్ల కమీషన్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు సురేష్‌బాబు, తిప్పన్ననాయుడు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట డీలర్లు నిరసన తెలిపారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఝాన్సీరాణికి అందజేశారు. కార్యక్రమంలో డీలర్లు శివకేశవరెడ్డి, వెంకట్రామిరెడ్డి, శంకర్‌నాయక్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడిగా రాము

గద్వాలటౌన్: ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా అలూరు బిలకంటి రాము సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణ అధ్యక్ష స్థానం కోసం ఇటీవల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. అధ్యక్ష స్థానానికి రాము ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో అయన ఎన్నిక లాంఛనమైంది. రాము ఎన్నికపై పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు అభినందనలు తెలియజేశారు.

జాతీయ రహదారిపై ఆకస్మిక తనిఖీలు

అలంపూర్: జాతీయ రహదారిపై ఆకస్మిక తనిఖీలు ఉంటాయని అలంపూర్ సీఐ రవిబాబు అన్నారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారి పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద సోమవారం పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సీఐ రవిబాబు, ఉండవెల్లి ఎస్ఐ శేఖర్ ఆధ్వర్యంలో ఏపీ, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి ప్రవేశించే వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను పురస్కరించుకొని తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉత్సవాల నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి అసాంఘిక శక్తులు, మత్తు పదార్థాల రవాణ వంటివి నియంత్రించడానికి తనిఖీలు కొనసాగుతాయన్నారు. ప్రశాంత వాతవరణంలో ఉత్సవాలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏఓ శ్రీలత

ధరూరు: ఎరువులు, పురుగు మందులు రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం డీలర్లకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ దుకాణాల వద్ద స్టాక్ బోర్డుతో పాటు ధరల పట్టికలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా లావాదేవీలను ఈ- పాస్ ద్వారానే నిర్వహించాలన్నారు. ప్రతి రైతు ఆధార్ లేదా ఓటర్ ఐడీ ద్వారా ఈ పాస్ మిషన్లో ఎంట్రీ చేయాలన్నారు. రైతులకు అందించే ఎరువులు, క్రిమిసంహారక మందుల్లో నకిలీకి ఆస్కారం లేకుండా చూడాలని పేర్కొన్నారు. రైతులకు తప్పనిసరిగా రశీదులు అందజేయాలని పేర్కొన్నారు.

పాత గోడలపై కొత్త స్లాబులా ?



శాంతినగర్‌లోని ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

శాంతినగర్: ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో నిర్మించిన పాత గోడలపై కొత్తగా స్లాబులు వేయడం ఎంతవరకు సమంజసమో అధికారులకే తెలియాలని బీజేపీ నాయకులు మండిపడ్డారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ 3వ వార్డులోని ప్రాథమిక పాఠశాలను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు రామకృష్ణ సోమవారం సందర్శించారు. పాఠశాల గోడలు, పైకప్పు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల బూతు బంగ్లాలా ఉందని, పాత గోడల మీద కొత్తగా స్లాబును నిర్మిస్తున్నారన్నారు. గోడలు కూలే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న తరగతి గదులు పైకప్పులు లీకవుతున్నాయని, తరగతి గదుల్లో నిలిచిన వర్షపు నీటిలో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. క్రీడా మైదానం, ప్రహరీ లేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్‌ను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు వివరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగరాజు, పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సంజన్న, మోహన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చదరంగంతో మేధస్సు మెరుగు



విద్యార్థులకు చెస్‌బోర్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

రాజోళి: చదరంగం ఆడటం వల్ల మేధస్సు మెరుగవుతుందని పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం చైర్మన్ రవిప్రకాష్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కోఆర్డినేటర్ మహిపాల్‌రెడ్డితో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం చెస్ బోర్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు మెదడుకు మేత పెట్టే చెస్ క్రీడను ఆడటం వల్ల మేధోశక్తి పెంపొందటంతో పాటు, భవిష్యత్‌లో తెలివితేటలతో ముందడుగు వేస్తారన్నారు. చెస్‌లో మెళకువలు జీవితంలో ఎదుగుదలకు తోడ్పతాయన్నారు. కార్యక్రమంలో పాలసాని మధుసూదన్‌రెడ్డి, ఎంపీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, ఎంఈఓ భగీరథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం



అలంపూర్ మున్సిపల్ కార్యాలయంలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న కమిషనర్ శంకర్



వడ్డేపల్లి మున్సిపల్ కార్యాలయంలో విగ్రహాలు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజయ్య

అలంపూర్: మట్టితో తయారు చేసిన గణపుతులను పూజించి పర్యవరణాన్ని కాపాడుకుందామని మున్సిపల్ కమిషనర్ శంకర్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మట్టి వినాయకులను పూజించడం వలన పర్యవరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. అదే విధంగా ఈ నెల 26న పాత మున్సిపల్ కార్యాలయంలో మట్టితో తయారు చేసిన వినాయకు విగ్రహాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి

శాంతినగర్: వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని వడ్డేపల్లి మున్సిపల్ కమిషనర్ రాజయ్య కోరారు. వడ్డేపల్లి మున్సిపల్ కార్యాలయంలో మట్టి గణపతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో రోడ్డుకు మరమ్మతు



రోడ్డుకు మరమ్మతు చేయిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: మండలంలోని ఉప్పల బీటీరోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకులు సోమవారం సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడారు. ప్రభుత్వం రోడ్లకు మరమ్మతు చేయడం లేదన్నారు. మండంలో ఛిద్రమైన రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రోడ్లకు మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని కేబుల్ వైర్లు తొలగించాలి



ప్రమాదకరంగా ఉన్న కేబుల్ వైర్లను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

గద్వాలటౌన్: విద్యుత్తు స్తంభాలకు ప్రమాదకరంగా అమర్చిన కేబుల్ టీవీ, ఇంటర్‌నెట్ తీగలను తక్షణమే తొలగించాలని విద్యుత్తు శాఖ ఏడీఈ రమేష్‌బాబు సూచించారు. సోమవారం ఏఈ శివకుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లతో కలిసి పట్టణంలో స్తంభాలకు ఏర్పాటు చేసిన తీగలను పరిశీలించారు. అనుమతులు లేకుండా కేబుల్ టీవీ ప్రసారాల నిర్వాహకులు, ఇంటర్‌నెట్ నిర్వాహకులు ఇష్టానురీతిగా స్తంభాలకు అమర్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాహకులు స్వచ్ఛందంగా వైర్లను తొలగించాలని ఆదేశించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు విద్యుత్ వినియోగం విషయంలో సంస్థ సూచనలు, సలహాలను పాటించాలని పేర్కొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలన



ఎములోనిపల్లిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు



జాంపల్లిలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రేవతిని సన్మానిస్తున్న విజయ్‌కుమార్

ధరూరు: మండల పరిధిలోని రేవులపల్లి ఉన్నత పాఠశాల, ఎములోనిపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ రవీంద్రబాబు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. రికార్డులు, హాజరు రిజిస్టర్లు తనిఖీ చేశారు. సమయానుకూలంగా పాఠశాలలకు హాజరు కావాలన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ 100 శాతం పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాంపల్లి పాఠశాల సందర్శన

మండల పరిధిలోని జాంపల్లి ప్రాథమిక పాఠశాలను సోమవారం రాష్ట్రీయ పండిత పరిషత్ ఉపాధ్యక్షుడు, పాఠశాల సహాయకుడు ఎంఎస్ విజయ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను హెచ్‌ఎం రేవతిని అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యాబోధన, కనీస సౌకర్యాలపై ఆరా తీశారు. పాఠశాల సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రత, ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చిని చెట్ల మధ్య పాఠశాల, తరగతి గదుల గోడలపై అందమైన చిత్రీకరణలు, మౌలిక సదుపాయాలు ప్రైవేటు పాఠశాలలను తలపించేలా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రేవతిని అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధి శాంతినగర్‌లోని బీసీ హాస్టల్‌ను వడ్డేపల్లి మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ వీరభద్రప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని విద్యార్థుల సంఖ్యను రికార్డుల్లో పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో మౌలిక వసతులు, పిల్లల నమోదు వివరాలు, మెనూ వివరాలను వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సర్దార్‌మియా, రెవెన్యూ సిబ్బంది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శాంతినగర్‌లోని బీసీ హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ వీరభద్రప్ప